సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

శనివారం | 13 | జూలై | 2024



ఏడు దీవుల లక్నవరం

లక్నవరం సరస్సులోని ఏడు దీవుల్లో ఇప్పటికే మూడు దీవులు పర్యాటకులకు అందుబాటులో ఉండగా.. మిగతా దీవుల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. - 8లో▸



పనిచేసే అధికారులే ఏజెన్సీకి రావాలి

పని చేయాలనే సంకల్పం ఉన్న అధికారులే ఏజెన్సీ గ్రామాలకు రావాలని మంత్రి సీతక్క అన్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం $30^0/25^0$

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

మోక్షం కలిగేనా?

- కలగానే పలుగుల–చెన్నూరు వంతెన నిర్మాణం
- రూ.110కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు
- మట్టి నమూనా పరీక్షలు చేసి ఏడేండ్లు..
- వంతెన నిర్మిస్తే తగ్గనున్న దూరభారం



పలుగుల వద్ద వంతెన నిర్మాణంచేసే ప్రాంతం

కాళేశ్వరం: పలుగుల–చెన్నూరు నడుమ వంతెన నిర్మాణం 12 సంవత్సరాలుగా కలగానే మిగిలిపోయింది. రూ.110కోట్ల వ్యయంతో తయారుచేసిన ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. 2017లో చేపట్టిన మట్టి పరీక్షలు ముందుకు సాగలేదు. దీంతో జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల జిల్లా ప్రజలు దూరభారంతో ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి నిర్మాణంతో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు సైతం ప్రయాణం సులువవుతుంది.

మహదేవపూర్ మండలం పలుగుల–మంచిర్యాల చెన్నూరు మధ్యలో గోదావరి నదిపై వంతెన నిర్మాణం కోసం 2012లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదనలు తయారుచేసింది. మాజీ ఎంపీ, ప్రస్తుత చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ రూ.110కోట్ల వ్యయంతో నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేశారు. ఆమోదం తెలిపి, నిధులు మంజూరయ్యే సమయంలో ఎన్నికలు రావడంతో నిలిచిపోయింది.

మట్టి పరీక్షలు చేసినా..

మహదేవపూర్ మండలం పలుగుల వద్ద గోదావరిపైన 1.2 కిలోమీటర్ల పొడవుతో 40 పిల్లర్లతో మంచిర్యాల జిల్లా చెన్నూరు గ్రామ గోదావరి ఒడ్డు వరకు వంతెన నిర్మాణానికి 2017 ఏప్రిల్లో రెండు వారాల పాటు యంత్రాలతో మట్టి నమూనా పరీక్షలు నిర్వహించారు. గోదావరిలో మొత్తం ఏడు చోట్ల మట్టి నమూనా పరీక్షలు చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన హెచ్‌బీఎస్ సంస్థ ఆధ్వర్యంలో 40 మీటర్ల లోతు వరకు మట్టి పరీక్షించారు. కానీ ఇప్పటివరకు వంతెన నిర్మాణంపై ఊసెత్తకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు. కుంట్లం, ఎర్రాయిపేట మీదుగా కూడా నిర్మాణం చేపట్టడానికి అప్పటి ప్రభుత్వం సన్నాహాలు చేపట్టింది. కుంట్లం, ఎర్రాయిపేట మధ్య గోదావరిలో నిర్మాణం జరిగితే మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం ఎర్రాయిపేట ఒడ్డుపైనే జాతీయ రహదారి లింకు ఉంటుంది. పలుగుల వద్ద వంతెన నిర్మాణం పూర్తయితే శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకునేందుకు కుమ్రుంభీం, మంచిర్యాల జిల్లాల ప్రజలకు ప్రయాణం దూరం తగ్గనుంది.



మట్టి నమూనా పరీక్షలు (ఫైల్)

వంతెన నిర్మిస్తే..

పలుగుల, మద్దులపల్లి వాసులు నిత్యావసరాలకు, వైద్య, వ్యాపారపరంగా పొరుగున ఉన్న మంచిర్యాల జిల్లా చెన్నూరుకు వెళ్తుంటారు. ప్రస్తుతం కాళేశ్వరం, సిరోంచ మీదుగా చెన్నూరు వెళ్లాలంటే 50 కిలోమీటర్ల దూరం వస్తుంది. పలుగుల వద్ద వంతెన నిర్మిస్తే 4–5 కిలోమీటర్ల దూరంతో సులువుగా చెన్నూరుకు చేరుకునే అవకాశం ఉంది. వంతెన నిర్మాణంతో కొమురంభీం, మంచిర్యాల, జయశంకర్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రజలకు రవాణా సౌకర్యాలు పెరిగి దూరభారం తగ్గనుంది.

చిగురిస్తున్న ఆశలు..

ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఉండడంతో పాటు మంథని, చెన్నూరులో ఎమ్మెల్యేలుగా దుద్దిళ్ల శ్రీధర్ బాబు, గడ్డం వివేక్, పెద్దపల్లి ఎంపీగా వివేక్ కుమారుడు గడ్డం వంశీకృష్ణ ఉన్నారు. దీంతో ప్రజల ఆశలు చిగురిస్తున్నాయి. నిధులు మంజూరుచేసి వంతెన నిర్మాణం పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

దూరం తగ్గుతుంది..



పలుగుల–చెన్నూరు మధ్యలో వంతెన నిర్మిస్తే దూరభారం తగ్గుతుంది. కొన్నేళ్లుగా నిర్మాణంపై క్లారిటీ లేదు. పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. నిర్మాణం చేపడితే అన్ని రకాల వసతులు లభిస్తాయి. వైద్యపరంగా చెన్నూరు, మంచిర్యాల, వాణిజ్య మార్కెట్‌కు దగ్గరవుతుంది.

- రాగం రాజేందర్, కుంట్లం

ఇసుక లారీలతో ట్రాఫిక్ జాం

కాళేశ్వరం: కాళేశ్వరం టు మద్దులపల్లి క్రాస్ వరకు ఇసుక లారీలతో శుక్రవారం ట్రాఫిక్ స్తంభించింది. ఖాళీలారీలు ఓ వైపు, మరో వైపు లోడు లారీలతో మధ్యాహ్నం ట్రాఫిక్ స్తంభించింది. దీంతో కాళేశ్వరం మీదుగా మద్దులపల్లి, నాగేపల్లి, అన్నారం, పలుగుల, కుంట్లం గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ద్విచక్రవాహనదారులు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పూస్కుపల్లి వద్ద 8వ క్వారీలో రోడ్డుపై లారీలు నిలిపివేయడంతో మరింత ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం ఇదే తీరు కొనసాగుతున్నా సంబంధిత టీజీఎండీసీ, పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. అటువైపు చూసిన దాఖలాలు లేవని ఆరోపణలు ఉన్నాయి. పత్రికల్లో వార్తలు వచ్చినప్పుడే ఒక్కపూట హడావిడి చేసి వదిలేస్తున్నారని ప్రయాణికులు చర్చించుకుంటున్నారు. క్వారీల యజమానులు లారీలకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయలేదు. దీంతో కాళేశ్వరం నుంచి మద్దులపల్లి వరకు ఐదు కిలోమీటర్ల మేర లారీలు రెండువైపులా రోడ్డుపై తిష్టవేసి ఉంటున్నాయి. దీంతో రవాణా సౌకర్యాలు లేక సామాన్యులు గంటలపాటు రోడ్డుపై సర్కస్‌ఫీట్లు చేస్తూ ఇళ్లకు చేరుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం మద్దులపల్లికి చెందిన ఓ యువకుడు కాళేశ్వరం నుంచి మద్దులపల్లికి వెళ్తుండగా గంటపాటు లారీలు మధ్యలో ఇరుక్కుపోయాడు. దీంతో 100కు కాల్ చేశాడు. పోలీసులు మాత్రం అక్కడికి రాలేదని ఆ యువకుడు తెలిపాడు. ప్రమాదాలు జరుగకముందే నివారణ చర్యలు చేపట్టాలని, లారీలతో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పూస్కుపల్లి వద్ద స్తంభించిన ట్రాఫిక్ జాం

వాగు దాటేదెట్ల?



కొట్టుకుపోయిన కొండాయి మట్టిరోడ్డు



వాగుదాటుతున్న కొండాయి ప్రజలు (ఫైల్)

- అరచేతిలో ప్రాణాలు
- నత్తనడకన ఐరన్ వంతెన నిర్మాణ పనులు
- బిక్కుబిక్కుమంటున్న కొండాయి, మల్యాల ప్రాంతాల ప్రజలు

ఏటూరునాగారం: ముందు చూస్తే నుయ్యి.. వెనుక చూస్తే గొయ్యి.. అన్నట్లు ఉంది కొండాయి, మల్యాల, గోవిందరాజుల కాలనీ ప్రజల పరిస్థితి. ఒకవైపు రోడ్డు పూర్తిగా తెగిపోయి వాగు దాటలేని పరిస్థితి. మరొకవైపు ఊరట్టం, మేడారం వైపు కొడ్రేడు వద్ద కల్వర్టుపై నుంచి వరదనీరు, రోడ్డంతా బురదమయంగా మారి వాహనాలు కూరుకుపోయి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి, మల్యాల ముంపు గ్రామాల కష్టాలు వర్ణించలేనివి. గత సంవత్సరం జూలైలో వచ్చిన వరదలకు జంపన్నవాగు ఉప్పొంగి కొండాయి గ్రామం ముంపుకు గురైంది. దీంతో సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లే క్రమంలో 8 మంది తమ ప్రాణాలను కోల్పోయిన విషయం విదితమే. అలాగే 2024లో వచ్చిన ఎన్నికలు, మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా జంపన్నవాగుపై తాత్కాలికంగా రెండు మట్టి రోడ్లను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ రోడ్లు కాస్త ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షాలకే తెగిపోయాయి. దీంతో మళ్లీ ఆయా ముంపు గ్రామాల ప్రజలకు మండల కేంద్రంతో సంబంధాలు తెగిపోయాయి. నిత్యావసరాలకు, వైద్య సేవలకు తాము అల్లాడుతున్నామని బాధితులు వాపోయారు. పీకల్లోతు వాగులో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వాగు దాటుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈత గాళ్ల సహాయంతో వాగు దాటి తమ అవసరాలను తీర్చుకుంటున్నామన్నారు. కనీసం జంపన్న వాగుపై అధికారులు బోటును కూడా ఏర్పాటు చేయలేదన్నారు. ఇటీవల రూ.35 లక్షల నిధులతో జంపన్న వాగుపై చేపట్టిన ఐరన్ వంతెన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో మళ్లీ జంపన్నవాగు కష్టాలు ఆ గ్రామాల ప్రజలకు తప్పడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో వాగు పెరిగితే ప్రాణాలు కోల్పోవాల్సిందేనని అంటున్నారు. ప్రస్తుతం బిక్కుబిక్కుమంటూ తాము గడుపుతున్నామన్నారు.

శాశ్వత బ్రిడ్జి నిర్మించాలి..



కొండాయి వాగుపై బ్రిడ్జి లేక దినదినగండంగా బతుకుతున్నాం. ఏ అవసరం వచ్చినా ఏటూరునాగారం పోయే వాళ్లం. ఇప్పుడు ఎటు పోలేని పరిస్థితి. మళ్లీ వర్షాలు వస్తే మా పరిస్థితి చెప్పనక్కర్లు లేదు. వెంటనే శాశ్వత బ్రిడ్జి నిర్మించాలి.

-పరికి సుమలత, కొండాయి

రవాణా మార్గం ఏర్పాటు చేయాలి



ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తి చేసి రవాణా మార్గం ఏర్పాటు చేయాలి. ద్విచక్ర వాహనాలు నడిచేలా చేస్తే ప్రజల అవసరాలు కొంతమేర తీర్చుకోవచ్చు. వాగుదాటాలంటే అందరూ భయపడుతున్నారు.

-కాక ఫణిచందర్, కొండాయి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- జిల్లా వైద్యాధికారి మధుసూదన్



పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి మధుసూదన్

రేగొండ: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి మధుసూదన్ అన్నారు. మండలంలోని రాయపల్లి గ్రామంలో శుక్రవారం ఆశలు, ఏఎన్‌ఎంలతో కలిసి అన్ని కాలనీలలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులను అరికట్టవచ్చన్నారు. వర్షపు నీరు నిల్వ ఉన్న చోట ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఉపసర్పంచ్ దాతృత్వం

- రూ.5లక్షల సొంత డబ్బులతో డ్రెయినేజీ నిర్మాణం



పనులను ప్రారంభిస్తున్న నాయిని శ్రీనివాస్

కాటారం: పదవులు శాశ్వతం కాదు.. ప్రజా సేవ చేయడమే తన లక్ష్యమని ముందుకు కదులుతున్నాడు ఓ మాజీ ఉపసర్పంచ్. కాటారం గ్రామపంచాయితీ పరిధిలోని 1వ వార్డు, ఎస్సీ కాలనీ మధ్య మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో శాశ్వత పరిష్కారం చూపారు కాటారం మాజీ ఉపసర్పంచ్ నాయిని శ్రీనివాస్. ఉపసర్పంచ్‌గా పదవీ కాలం పూర్తయినప్పటికీ డ్రెయినేజీ సమస్యను కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రూ.5లక్షల సొంత డబ్బులతో సమస్య పరిష్కారం కోసం శ్రీకారం చుట్టారు. నిర్మాణపనులను శుక్రవారం ప్రారంభించారు. పదవితో సంబంధం లేకుండా దీర్ఘకాలిక సమస్య పరిష్కారానికి కృషి చేసిన శ్రీను సేవల పట్ల కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

భూపాలపల్లి అర్బన్: ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ తక్షణమే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డు స్మరణ్, కుమ్మరి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఆరేళ్ల నుంచి విద్యార్థులకు ఇవ్వవలసిన ఫీజులను ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. 2019 నుంచి స్కాలర్‌షిప్ బకాయిలు పేరుకుపోయి ఉన్నాయన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజుల పేరుతో విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదన్నారు. పెండింగ్ ఉపకార వేతనాలు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, చందు, ఈశ్వర్, నరేష్, స్వామి, సుధీర్ పాల్గొన్నారు.

భూసేకరణపై అపోహలు వద్దు

- మెరుగైన నష్టపరిహారం అందించేందుకు కృషి
- వంద శాతం పంట నమోదు చేపట్టాలి
- ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి
- కలెక్టర్ రాహుల్‌శర్మ



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి: గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణపై రైతులు ఎలాంటి అపోహలు చెందవద్దని, మెరుగైన పరిహారం అందించే విధంగా కృషి చేస్తామని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణానికి భూసేకరణపై టేకుమట్ల, చిట్యాల, మొగుళ్లపల్లి మండలాలకు చెందిన రైతులతో శుక్రవారం సమీకృత కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి రహదారులు చాలా అవసరమన్నారు. గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ద్వారా జిల్లా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. మూడు మండలాల పరిధిలోని 13 గ్రామాల్లోని రైతులు భూములను కోల్పోతున్నారని చెప్పారు. జిల్లాలో 130.5 ఎకరాలు 35 కిలోమీటర్ల మేర గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే వస్తుందని, రోడ్డు నిర్మాణం కోసం 45 మీటర్ల వెడల్పు మాత్రమే సేకరిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ మంగీలాల్ పాల్గొన్నారు.

పంట నమోదు ప్రక్రియ చేపట్టాలి..

జిల్లాలో వంద శాతం పంట నమోదు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ సూచించారు. శుక్రవారం సమీకృత కలెక్టర్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతు భరోసా, రైతు బీమా, పీఎం కిసాన్ లాంటి పథకాలను క్షేత్ర స్థాయిలో రైతులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. వానాకాలంలో పంటలను కాపాడుకోవడానికి తీసుకునే చర్యలపై రైతులకు వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాలో ఎరువుల కొరత లేకుండా చూడాలని, పంటలకు సరిపడా యూరియా, డీఏపీ, ఇతర ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. ఎరువుల కృత్రిమ కొరత, ఎరువులను అధిక ధరకు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ 15 రోజులకొకసారి పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేయాలని, నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు సహాయం కోసం జిల్లా వ్యవసాయ అధికారి విజయభాస్కర్ 72888 94787 నంబర్‌కు నేరుగా కాల్‌చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డీఏఓ విజయభాస్కర్, ఏఓలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి..

జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలు, ఇసుక పాలసీకి విధి విధానాల రూపకల్పనపై శుక్రవారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్, రెవెన్యూ, మైనింగ్, రవాణా, టీజీఎండీసీ, జాతీయ రహదారులు, భూగర్భ జలవనరుల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా రాత్రి వేళల్లో జిల్లావ్యాప్తంగా వాగుల నుంచి జరుగుతున్న ఇసుక అక్రమ రవాణా, గోదావరి పరివాహక ప్రాంతాలలోని ఇసుక రీచ్‌ల వద్ద లారీలు ఇష్టారీతిన నడుపుతున్నారన్నారు. అతివేగం, ఓవర్ లోడ్, సరైన వే బిల్లులు లేకుండా లారీలు నడిపితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టీజీఎండీసీ అధికారుల పర్యవేక్షణ కొరవడిందని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో ఎస్పీ కిరణ్‌ఖరే, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ మంగీలాల్, మైనింగ్ అధికారి జయరాజ్, వివిధ శాఖల అధికారులు, సీఐలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

స్నిఫర్ డాగ్‌తో ముమ్మర తనిఖీలు



స్నిఫర్ డాగ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏటూరునాగారం: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, చట్ట వ్యతిరేక పనులు మానుకోవాలని లేదంటే కఠిన చర్యలు తప్పవని ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై ఎస్కే తాజుద్దీన్ అన్నారు. మండల కేంద్రంలోని వై జంక్షన్, ఆర్టీసీ బస్టాండ్, ముల్లకట్ట బ్రిడ్జి వద్ద శుక్రవారం సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసు బృందాలతో ఆయన తనిఖీలు నిర్వహించారు. వంతెన మీదుగా వస్తున్న వాహనాలను మత్తు పదార్థాలు, మందుగుండు సామగ్రిల వాసన పసిగట్టగల స్నిఫర్ డాగ్‌తో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లు, పొల్యూషన్ పత్రాలను పరిశీలించి అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించి వదిలేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో మత్తు పదార్థాలు గంజాయి, గుడుంబాను పూర్తిస్థాయిలో అరికట్టడానికి హైదరాబాద్‌లో ప్రత్యేక శిక్షణ పొందిన స్నిఫర్ డాగ్‌తో ముమ్మరంగా వాహన తనిఖీలను చేపట్టినట్లు తెలిపారు. షాపుల వద్ద ఎవరైనా బోనో ఫిక్స్ కొనుగోలు చేయడానికి వస్తే సమాచారం అందించాలని కోరారు.

పొంచి ఉన్న ప్రమాదం



మహదేవపూర్–బొమ్మాపూర్ క్రాస్ వద్ద ఎండి మోడువారిన చెట్టు



మహదేవపూర్–బొమ్మాపూర్ క్రాస్ వద్ద మోడువారి ప్రమాదకరంగా మారిన చెట్టు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలకేంద్రంలోని బొమ్మాపూర్ క్రాస్ నుంచి వెళ్లే రహదారిలో ఎండిన చెట్లు మోడువారి దర్శనమిస్తున్నాయి. ఈ రహదారి మీదుగా మేడిగడ్డ(లక్ష్మీ) బ్యారేజీకి, పలిమెల మండలానికి నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు తరలివెళ్తుంటారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఎండిన చెట్లు కూలి పడే అవకాశం ఉంది. ప్రాణనష్టం జరుగకముందే నివారణ చర్యలు చేపట్టాలని పంచాయతీ, ఆర్‌అండ్‌బీ, ఫారెస్టు అధికారులను ప్రజలు వేడుకుంటున్నారు.

ప్రభుత్వ భూమిలో గుడిసెలు

వాజేడు: మండల పరిధిలోని మండపాక గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూమిలో చంద్రుపట్ల, కొంగాల, అరుణాచలపురం గ్రామాలకు చెందిన 25 కుటుంబాల వారు గుడిసెలను వేశారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ కుమార స్వామి, రెవెన్యూ సిబ్బంది శుక్రవారం అక్కడికి చేరుకొని గుడిసెలను తొలగించేందుకు యత్నించారు. దీంతో గుడిసె వాసులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అధికారులకు, గుడిసెవాసులకు వాగ్వాదానికి దారితీస్తున్నట్లు కనిపిస్తుండటంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం భోజనాలు చేసిన తర్వాత నాగారం గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను తీసుకుని ఏఎస్సై, కానిస్టేబుల్‌తో మళ్లీ వచ్చారు. ఎస్సై హరీష్ సంఘటన స్థలానికి చేరుకుని గుడిసెవాసులతో మాట్లాడారు. ఉన్నతాధికారుల అనుమతులు ఉంటేనే గుడిసెలు వేసుకోవాలని, లేదంటే ఇబ్బందులు పడే అవకాశం ఉందని నచ్చచెప్పారు.

న్యూస్‌రీల్

సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు వైద్య పరీక్షలు



భూపాలపల్లి అర్బన్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఆరోగ్య పరీక్షల నిమిత్తం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలు కొనసాగుతున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి తుకారం తెలిపారు. శుక్రవారం ఏరియాలోని కేటీకే ఓసీ–2లో వైద్య పరీక్షలు నిర్వహించారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఏమైనా అనారోగ్య సమస్యలు ఉంటే త్వరగా గుర్తించడంతో పాటు మెరుగైన వైద్యం పొందడానికి సహాయ పడుతుందన్నారు. ఈ వైద్య శిబిరంలో పీఓ వెంకటరామిరెడ్డి, గని మేనేజర్ కృష్ణప్రసాద్, వైద్యులు ప్రశాంత్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు



భూపాలపల్లి అర్బన్: సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేయడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భూపాలపల్లి జీఎం కార్యాలయం ఎదుట చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం నాటికి ఆరో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంచందర్, చంద్రమౌళి, నేరెళ్ల జోసెఫ్, కాంతారావు, ఆరబోయిన వెంకటేష్, పొన్నగంటి లావణ్య, పీకే రవికాంత్, ఎండీ యాకుబ్ పాషా పాల్గొన్నారు.

15వరకు చివరి గడువు

భూపాలపల్లి అర్బన్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 15వ తేదీతో ముగియనున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నిట్‌లో ఇన్‌క్యామ్–24 సదస్సు



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో శుక్రవారం ఇండియన్ కాన్ఫరెన్స్ ఆఫ్ అప్లైడ్ మెకానిక్స్(ఇన్‌క్యామ్)–24 సదస్సు నిట్ వరంగల్, ఇండియన్ సొసైటీ ఫర్ అప్లైడ్ మెకానిక్స్ సంయుక్తంగా ప్రారంభించారు. న్యూ ఎడ్యుకేషన్ పాలసీ వివిధ రంగాల్లో పరిశోధనకు తోడ్పడుతుందని, ఇన్‌క్యామ్–24 సదస్సు నూతన పరిశోధనలకు వేదికగా నిలవాలని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ ఆకాంక్షించారు. ఈసందర్భంగా సదస్సు సావనీర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో టెక్సాస్ ఏ అండ్ ఎం యూనివర్సిటీ యూఎస్‌ఏ ప్రొఫెసర్ జేఎన్.రెడ్డి, యూనివర్సిటీ ఆఫ్ మిసిసిప్పి ప్రొఫెసర్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

విప్రచిత్తా, మహా వజ్రేశ్వరి క్రమాల్లో అమ్మవారు





హన్మకొండ కల్చరల్: భద్రకాళి ఆలయంలో కొనసాగుతున్న శాకంబరీ నవరాత్రోత్సవాల్లో భాగంగా ఏడో రోజు శుక్రవారం అమ్మవారికి విప్రచిత్తా, మహా వజ్రేశ్వరీ క్రమాలలో పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు ఉదయం సుప్రభాతసేవ నిత్యాహ్నికం, చతుస్థానార్చనలు జరిపారు. అనంతరం అమ్మవారి స్నపనమూర్తిని కాళీక్రమమైన విప్రచిత్తా క్రమంలో, అమ్మవారి భోగబేరాన్ని షోడశీక్రమంలో మహా వజ్రేశ్వరీగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు. శుక్రవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

క్లుప్తంగా

సన్న బియ్యం పేరుతో మోసం

కాజీపేట: తక్కువ ధరలకే సన్నబియ్యం విక్రయిస్తామంటూ కొంతమంది వ్యక్తులు రేషన్ బియ్యం అంటగట్టి పలువురి నుంచి డబ్బులు కాజేసిన ఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ టాటా ఏస్ వాహనంలో వచ్చిన ముగ్గురు వ్యక్తులు బీపీటీ సన్న రకం బియ్యం అంటూ 25 కిలోల బస్తాను చూపిస్తూ బియ్యాన్ని విక్రయించారు. సాధారణంగా మార్కెట్‌లో 25కిలోల సన్న బియ్యం బస్తా ప్రస్తుతం రూ.1,400 నుంచి రూ.1,500వరకు ఉంది. కానీ సదరు వ్యక్తులు రూ.1,000కే విక్రయించడంతో తక్కువ ధరకు వస్తుందని పలువురు ఎగబడి కొన్నారు. వారికి అనుమానం రాకుండా బియ్యం బస్తా పైభాగంలో ఉన్న బియ్యాన్ని చూపించి బురిడీ కొట్టించారు. తమ సెల్‌ఫోన్ నంబర్లను సైతం ఇచ్చి వారిని నమ్మించారు. బాధితులు ఇంట్లో బియ్యం బస్తా విప్పి చూడగా అందులోని పైభాగంలో మాత్రమే కొంతమేర సన్న బియ్యం ఉండగా కింద భాగమంతా రేషన్ బియ్యం ఉండడం చూసి కంగుతిన్నారు. దీంతో వారు ఇచ్చిన సెల్‌ఫోన్ నంబర్లకు కాల్ చేయగా.. స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయినట్లుగా గుర్తించి ఆవేదనకు గురై చేసేదిలేక మిన్నకుండిపోయారు.

'జెన్‌కో' అభ్యర్థులకు ప్రత్యేక బస్సులు

హన్మకొండ: హైదరాబాద్‌లో ఈ నెల 14న నిర్వహించే టీజీ జెన్‌కో అసిస్టెంట్ ఇంజనీర్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంచనున్నట్లు ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ వంగల మోహన్ రావు శుక్రవారం తెలిపారు. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు హనుమకొ ండ నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు న డుపనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి హత్య


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గీసుకొండ : గ్రేటర్ పరిధిలోని 16వ డివిజన్ జాన్‌పాక మాస్టర్‌జీ పాఠశాలకు వెళ్లే దారిలో నిర్మాణంలో ఉన్న ఇంటి వద్ద గుర్తుతెలియని వ్యక్తి(38) హత్యకు గురయ్యాడు. గీసుకొండ పోలీసుల కథనం ప్రకారం.. జాన్‌పాకలో బలగాని అనిల్ ఇంటి నిర్మాణం పనులను చేపడుతున్నాడు. ఇందులో భాగంగా ఇంటి ఎదుట ఇసుక కుప్పను పోసుకున్నాడు. అడ్డా కూలీగా ఉన్న ఓ వ్యక్తి ఇంటి పని నిమిత్తం వచ్చి వెళ్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం ఉదయం బలగాల అనిల్‌కు ఇసుక కుప్పలో కూలీ మృతదేహం కనపడటంతో పోలీసులకు సమాచారం అందించాడు. అతడిని గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి రాయితో తలపై మోది హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. మృతుడు ఆంధ్రా ప్రాంతానికి చెందిన వాడిగా భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని గీసుకొండ సీఐ బాబూలాల్ సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 85031, 87126 85240 సెల్‌నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. మృతుడి వివరాలు తెలిస్తే అతడిని హత్య చేసింది ఎవరో తెలుసుకోవచ్చని సీఐ తెలిపారు.

ఏడు దీవుల లక్నవరం

ఆహ్లాదాన్ని పంచుతున్న సరస్సు, పరిసరాలు

- పర్యాటకులకు అందుబాటులో మూడు దీవులు
- మిగతా దీవులపై కొనసాగుతున్న అభివృద్ధి పనులు
- అటవీ శాఖ ఉద్యానవనంలో జింకలు, చిల్డ్రన్స్ పార్కుల ఏర్పాటు
- దృష్టి సారిస్తే టూరిజం సెంట్రల్ పాయింట్‌గా గుర్తింపు


లక్నవరం వ్యూ (ఫైల్)

గోవిందరావుపేట: ప్రకృతి సహజసిద్ధ సోయగం.. ఏడుదీవుల వరం.. ములుగు జిల్లా గోవిందరావుపేటలోని లక్నవరం. వరంగల్ – భూపాలపట్నం జాతీయ రహదారి 163 నుంచి బూస్సాపూర్ గ్రామం మీదుగా సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్నవరం సరస్సు పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందింది. సరస్సులోని ఏడు దీవుల్లో ఇప్పటికే మూడు దీవులు పర్యాటకులకు అందుబాటులో ఉండగా.. మిగతా దీవుల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. రెండేళ్లకోసారి జరిగే మేడారం జాతర సమయంలో జంపన్నవాగులోకి లక్నవరం సరస్సు నీటినే వదులుతారు.

హరిత హోటళ్లు..

టూరిస్టులు ఉండటానికి సరస్సు మధ్యలో హరిత హోటళ్లు ఉన్నాయి. ప్రైవేట్ సదుపాయాలు కూడా ఉంటాయి. హరిత హోటళ్లలో డార్మిటరీ రూమ్స్ ఏసీ, నాన్ ఏసీ గదులు అందుబాటులో ఉంటాయి. గ్లాస్ రూమ్స్ కూడా ఉన్నాయి. ఈ గదుల వినియోగానికి ఒకరోజుకు రూ.2,000 నుంచి రూ.5,000 వరకు చెల్లించాల్సి ఉంటుంది. పర్యాటకుల తాకిడి ఎక్కువ ఉండడం వల్ల ఆన్‌లైన్ లో కూడా టికెట్స్ అందుబాటులో ఉంచారు. ఫుడ్ కోసం రెస్టారెంట్‌లు కూడా ఉన్నాయి. లక్నవరంలో మూడు దీవుల్లో ప్రస్తుతం పర్యాటకులకు ఈ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. మిగతా దీవుల్లో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

మనసు దోచే ఊయల వంతెన..

లక్నవరం సరస్సు అందాలు చూడాలన్నా.. వర్ణించాలన్నా.. ఒక్కసారైనా పర్యటించాల్సిందే.. సరస్సు నీటిలో తేలియాడుతున్నట్లుగా ఊయల వంతెన పై నడుస్తూ చుట్టూ ఉన్న కొండలు, దీవులను చూస్తే కలిగే ఆనందం వర్ణనాతీతం. సరస్సులో బోటింగ్ చేస్తే వచ్చే హుషారే వేరంటారు.. పర్యాటకులు. కాకతీయ రాజులు ప్రత్యేక శ్రద్ధ వహించి అభివృద్ధి చేసిన ఈ సరస్సు సుమారు 5వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. అధికారిక లెక్కల ప్రకారం.. 10వేలు, అనధికారికంగా మరో పదివేల ఎకరాలకు పైగా సరస్సు నీటితో వ్యవసాయ సాగుజరుగుతోంది. ప్రస్తుతం సరస్సు అభివృద్ధిపై తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రత్యేక దృష్టి సారించింది. బ్రిడ్జి మ్యాన్ ఆఫ్ ఇండియాగా పిలుచుకునే గిరీశ్ భరద్వాజ్ డిజైన్ చేసిన ఈ బ్రిడ్జి ఆధారంగా ప్రభుత్వం మరో బ్రిడ్జిని నిర్మించింది.

ఆదాయం, ఆహ్లాదం..

వివిధ ప్రాంతాల నుంచి లక్నవరం వచ్చే పర్యాటకలకు మరింత ఆహ్లాదాన్ని, వన్య ప్రాణులను దగ్గర నుంచి చూసే అవకాశాన్ని కల్పించాలనే ఆలోచనతో అటవీ శాఖ అధికారులు చేసిన కార్యచరణ అద్భుతం. 2019లో పునరావాస కేంద్రంతోపాటు అటవీ శాఖ ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో దుప్పుల పునరావాస కేంద్రం కింద అటవీ శాఖ అధికారులు 20దుప్పులు, జింకలకు పకడ్బందీ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి పునరావాస పునరుత్పత్తి ఏర్పాటు చేశారు. అందుకు అణుగుణంగా లక్నవరం తరలివచ్చే వేలాది మంది పర్యాటకులను ఆకట్టుకునేందుకు అటవీ శాఖ ఉద్యానవనం పేరుతో అద్భుతమైన పార్కును తీర్చిదిద్దారు. ఇందులో రూ.7.50లక్షల ఎంపీ నిధులతో చిల్డ్రన్స్ పార్క్‌ను సైతం ఏర్పాటు చేశారు. ఈ ఉద్యానవనం సందర్శించేందుకు పెద్దలకు రూ.30, పిల్లలకు రూ.20 టికెట్ ఏర్పాటు చేసి ఆ నిధులతో మెయింటెన్స్ చేసేందుకు కార్యచరణ రూపొందించారు.


అటవీశాఖ పర్యావరణ ఉద్యానవనం


అడవిలో నుంచి లక్నవరం సరస్సుకు దారి

అండగా ఉంటాం.. అధైర్య పడొద్దు


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

- రక్షణతోపాటు ఉద్యోగం కల్పిస్తాం
- పదహారు చింతల్ తండా బాధితులకు ఎమ్మెల్యే దొంతి పరామర్శ


బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

చెన్నారావుపేట: తల్లి దండ్రులను కోల్పోయి ఒంటరైన పిల్లలకు అండగా ఉంటానని, అధైర్య పడొద్దని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అభయమిచ్చారు. ఈ మేరకు వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని పదహారు చింతల్ తండాలో ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన శ్రీనివాస్, సుగుణ దంపతుల పిల్లలను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి శుక్రవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హంతకుడు నాగరాజుకు శిక్ష పడేలా చూస్తానని అన్నారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లలకు ప్రభుత్వం తరపున ఖర్చుల నిమిత్తం రూ.4.25లక్షలు అందిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా అందేలా చూస్తామని తెలిపారు. పిల్లల చదువులు, వారి రక్షణకు ప్రభుత్వం బాధ్యత తీసుకుని, ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఈసందర్భంగా బంధువులు, గ్రామస్తులు నిందితుడిని ఉరి తీయాలని, తనకు ఉద్యోగం ఇప్పించాలని బాధితురాలు దీపిక ఎమ్మెల్యే మాధవరెడ్డిని వేడుకున్నారు. ఎమ్మెల్యే వెంట పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తక్కలపెల్లి రవీందర్‌రావు, పీసీసీ సభ్యుడు రంజిత్‌రెడ్డి, పెండెం రామానంద్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ ఉన్నారు. ఇదిలా ఉండగా.. ఈ భయానక ఘటన నుంచి తండా ప్రజలు ఇంకా తేరుకోలేకపోతున్నారు. రెండు రోజులుగా సీఐ చంద్రమోహన్, ఎస్సై అరుణ్, జనగామ ఎస్సై రాజేష్‌కుమార్‌లు రేయింబవళ్లు తండాలో పికెటింగ్, బందోబస్త్ ఏర్పాటు చేశారు.

మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య


గణేశ్ (ఫైల్)

బచ్చన్నపేట: మండలంలోని పడమటి కేశ్వాపూర్ గ్రామానికి చెందిన గిద్దెల గణేశ్ (20) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గిద్దెల మేఘమాల, బాలయ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు సంతానం. సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో గణేశ్ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో పలు సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో కొన్ని రోజులుగా బాధపడుతూ ఉండేవాడు. ఈక్రమంలో శుక్రవారం ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు, కుటుంబ సభ్యులు వెతకగా సమీప వ్యవసాయ భూమిలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుని కన్పించాడు. దీంతో గణేశ్ తండ్రి ఫిర్యాదు మేరకు ఘటనా స్థలం వద్దకు ఎస్సై సతీష్‌కుమార్ చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ, బస్సు ఢీ: 15 మందికి గాయాలు


ప్రమాదస్థలంలో బస్సు, లారీ

ములుగు రూరల్: ములుగు జిల్లా పందికుంట –మల్లంపల్లి మధ్యలో శుక్రవారం ఉదయం లారీ, బస్సు ఢీ కొన్న ఘటనలో 15మంది గాయపడ్డారు. ప్రమాదానికి సంబంధించి, వివరాలిలా ఉన్నాయి.. ములుగు నుంచి హనుమకొండకు ఆర్టీసీ అద్దె బస్సు 33మంది ప్రయాణికులతో వెళ్తున్న క్రమంలో హనుమకొండ వైపు నుంచి వస్తున్న లారీ ఎదురుగా ఢీ కొట్టింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 15మంది ప్రయాణికులు, కండక్టర్‌కు గాయాలయ్యాయి. గాయాలైన వారిని అంబులెన్స్‌లో ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒకరిని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మిగతా వారు ములుగు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. లారీ డ్రైవర్ బోయపల్లి మహేశ్‌పై ములుగు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆర్టీసీ రిజనల్ మేనేజర్ విజయభాను తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ.. రోడ్డు మరమ్మతు పనుల్లో భాగంగా వన్‌వే ఏర్పాటు చేశారు. ఈక్రమంలో పందికుంట వద్ద లారీ డ్రైవర్ అతి వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌తో బస్సును ఢీ కొట్టాడు. ఆర్టీసీ డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రాణనష్టం జరగలేదని అన్నారు. గాయపడిన వారిని ఆర్‌ఎం ములుగు ఏరియా ఆస్పత్రిలో పరామర్శించినట్లు తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ రీజనల్ మేనేజన్ భాను కిరణ్, వరంగల్ డీఎంలు సురేష్, మోహన్‌రావు, ఎస్టీఐ కుమార్ తదితరులు ఉన్నారు.

పనిచేసే అధికారులే ఏజెన్సీకి రావాలి

- ప్రజా దర్బార్‌లో మంత్రి సీతక్క
- రైతు భరోసా అందించాలని అధికంగా వినతులు


ప్రజా దర్బార్‌లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ

కొత్తగూడ: పని చేయాలనే సంకల్పం ఉన్న అధికారులే ఏజెన్సీ గ్రామాలకు రావాలని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. మానుకోట జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్(గ్రీవెన్స్)లో ఆమె మాట్లాడారు. కొత్తగూడ, గంగారం, గూడూరు, మహబూబాబాద్, బయ్యారం మండలాల ప్రజలు మంత్రి సీతక్కకు వినతిపత్రాలు అందజేశారు. ఎక్కువగా రైతు భరోసా డబ్బులు అందించాలని వినతులు అందించారు. మండలంలో రికార్డుల ప్రక్షాళన సమయంలో ఫారెస్టు అధికారుల వల్ల పట్టాలు రద్దయ్యాయని, సర్వేలో రెవెన్యూ భూమి అని తేలినా హక్కు పత్రాలు ఇవ్వలేదని పలువురు వినతిపత్రం అందజేశారు. వెంటనే పట్టాలు జారీ అయ్యేలా చూడాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌కు మంత్రి సూచించారు. గంగారం, కొత్తగూడ మండలాల్లో కొత్తగా పోడు జరగకుండా, సాగులో ఉన్న పాత భూముల్లో వ్యవసాయానికి ఆటంకం లేకుండా చూడాలని జిల్లా ఫారెస్ట్ అధికారి బత్తుల విశాల్‌కు సూచించారు. గూడూరు మండలంలో ఈఎంఆర్‌ఎస్ పాఠశాలకు తమ భూములను బలవంతంగా లాక్కున్నారని బాధితులు వినతిపత్రం అందించగా వారికి ప్రత్యామ్నాయం చూపించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

స్టేజి దిగివచ్చి..

బయ్యారం మండలం గౌరారం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు వట్టం సైదమ్మ వినతిపత్రం ఇచ్చేందుకు ఇబ్బంది పడుతూ రావడం చూసిన మంత్రి సీతక్క స్టేజి దిగి ఆమె వద్దకు వెళ్లి వినతి పత్రం తీసుకున్నారు.

శభాష్ పోలీస్..


చంటిపాపను లాలిస్తున్న మహిళా పోలీస్

మంత్రి సీతక్కకు వినతి పత్రం ఇవ్వడానికి వచ్చిన ఓ దివ్యాంగురాలిని మహిళా పోలీసులు ఎత్తుకుని తీసుకెళ్లారు. అలాగే వినతిపత్రం ఇవ్వడానికి చంటిపిల్లతో ఓ తల్లి వచ్చింది. ఈక్రమంలో ఆమె వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లగా.. పాపను ఓ కానిస్టేబుల్ ఎత్తుకుని లాలించింది.

యువతను చైతన్యం చేయాలి..

యువత గంజాయి, మాదక ద్రవ్యాలకు బానిస కాకుండా చైతన్యం చేయాలని అధికారులతో నిర్వహించిన సమీక్షలో సీతక్క సూచించారు. గంజాయి, మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపాలని పోలీసు అధికారులకు సూచనలు చేశారు. అనంతరం వేలుబెల్లి సమీపంలోని కత్తెర్ల వాగుపై నిర్మించనున్న బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎస్పీ రాంనాథ్ కేకన్, ఏటూరు నాగారం ఐటీడీఏ పీఓ చిత్రామిశ్ర, ట్రాన్స్ కో ఎస్‌ఈ నరేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంజేపీలో ర్యాగింగ్

భరించలేక తప్పించుకున్న 19 మంది పిల్లలు

- ఐదు కిలోమీటర్ల దూరంలోని పాత ఎంజేపీకి రాక
- హాస్టల్ వద్ద ఆందోళనకు దిగిన తల్లిదండ్రులు
- ప్రిన్సిపాల్, టీచర్ల నిర్లక్ష్యంపై ఆగ్రహం


ఆందోళన చేస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

జనగామ: సీనియర్, జూనియర్ విద్యార్థుల ర్యాగింగ్.. గెస్ట్ టీచర్ల వెటకారం మాటలు.. చీటికి మాటికి ఫిర్యాదులతో విసిగిపోయిన 19 మంది విద్యార్థులు గోడదూకి తప్పించుకున్న ఘటన పెంబర్తి మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకులంలో శుక్రవారం జరిగింది. బాధిత విద్యార్థులు బాలాజీ, టి.సాత్విక్, వి.సకిరానందన్, ఎం.భరత్, బి.విగ్నేష్, కార్తీక్, వినయ్, ఎం.రామ్‌చరణ్, ఎస్.శ్రీచరణ్, టి.విగ్నేష్, సీహెచ్.రామ్‌చరణ్, రుషి, హవీష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా కేంద్రం ధర్మకంచ రైల్వేట్రాక్ ఏరియాలోని బాలుర ఎంజేపీలో విద్యార్థుల సంఖ్య ఎక్కువ కావడంతో 154 మంది(8, 9వ తరగతి)ని పెంబర్తి ఎంజేపీ(బచ్చన్నపేటకు చెందిన)లో 20 రోజుల క్రితం చేర్పించారు. ఇక్కడి సీనియర్, జూనియర్ విద్యార్థులు ఇటీవల వచ్చిన పిల్లలను ర్యాగింగ్ చేస్తున్నారు. వాటర్ సంప్‌లో అపరిశుభ్రత వాతావరణం కలిగేలా చేయడంతో వద్దని జనగామ నుంచి వెళ్లిన విద్యార్థులు వారించగా.. వారిని వేధింపులకు గురిచేయడం ప్రారంభించారు. సంప్ వాటర్ అపరిశుభ్రం కావడంతో పైపులైన్ వద్ద బకెట్లతో నీరు తెచ్చుకుని కాలకృత్యాలు తీర్చుకుంటున్నామని బాధిత విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. టీచర్లు సైతం ప్రేయర్‌లో జనగామ బాయ్స్ బ్యాడ్ అనేలా వ్యవహరించారని కన్నీటి పర్యంతమయ్యారు. గెస్ట్ టీచర్లు బూతులు మాట్లాడుతూ అవహేళన చేశారని ఆరోపించారు. ఈ విషయమై కొత్తగా వచ్చిన ప్రిన్సిపాల్‌కు చెప్పినా పట్టించుకోలేదని, ఏ సంఘటన జరిగినా తమను బాధ్యులను చేస్తున్నారని వాపోయారు. ఇక అక్కడ ఉండకూడదని నిర్ణయించుకుని తెల్లవారుజామున గోడదూకి కాలినడకన సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న జనగామ పాత ఎంజేపీకి వచ్చేసినట్లు వివరించారు. పెంబర్తి గురుకులంలో భోజనం, కూర, చారు కూడా నాణ్యత లేక ఒక్క పూట కూడా తినలేక పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. పిల్లలు పారిపోయారని సమాచారం అందుకున్న తల్లిదండ్రులు గురుకులం వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు. ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేను కొత్తగా వచ్చాను..



పెంబర్తి ఎంజేపీకి ఇటీవలే వచ్చాను. జూన్‌లో 154 మంది పిల్లలు జనగామ నుంచి వచ్చారు. గొడవలు జరిగే విషయం నాకు తెలియదు. అయినా రోజూ నిఘా ఉంటుంది. నైట్ వాచ్‌మన్ పర్యవేక్షిస్తారు. పిల్లలు ప్లాన్ చేసిన సంగతి పసిగట్ట లేక పోయాం. ర్యాగింగ్‌పై విచారణ చేయిస్తాం. అటువంటిది జరగలేదని అనుకుంటున్నాం. పై అధికారులకు సమాచారం ఇచ్చాం.

– చంద్రమౌళి, పెంబర్తి ఎంజేపీ ప్రిన్సిపాల్

రిమాండ్‌కు తరలించకపోతే తడాఖా చూపిస్తాం

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

నల్లబెల్లి: అశ్వారావుపేటలో ఎస్సైగా పనిచేసిన శ్రీరాముల శ్రీను ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన సీఐ జితేందర్ రెడ్డి, పోలీస్ సిబ్బందిని 24 గంటలలోపు ఉద్యోగాల నుంచి తొలగిస్తూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించకపోతే మా తడాఖా చూపిస్తామని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హెచ్చరించారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేటలో శుక్రవారం ఎస్సై శ్రీను కుటుంబాన్ని ఎస్సీ, ఎస్టీ కమిషన్ బృందం పరామర్శించింది. శ్రీరాముల శ్రీను ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు శ్రీను చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. సీఐ, సిబ్బంది వేధింపులు, అవమానాలు భరించలేక ఎస్సై ఆత్మహత్య చేసుకున్నారంటే పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి ఎస్సై కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు వేధింపులకు పాల్పడిన వారిని శిక్షించాలని, ఆత్మహత్య చేసుకున్న ఎస్సై కుటుంబానికి న్యాయం చేయాలని వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేష్, ఎస్సీ, ఎస్సీ కమిషన్ సభ్యులు నూనవత్ రాంబాబు నాయక్, రేణికుంట్ల ప్రవీణ్, ఐనావత్ రాంబాబు, జిల్లా శంకర్, కొంకటి లక్ష్మీనారాయణ, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, మాజీ ఎంపీపీ బానోత్ సారంగపాణి, డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేందర్, జిల్లా అధ్యక్షుడు సురేష్, ఎబీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్, నాయకులు చంద్రమౌళి, వైనాల అశోక్, గుండాల రాజకొరయ్య, వడ్లూరి రమేష్, బట్టు సాంబయ్య, బొట్ల నరేష్, మేడ రంజిత్, గాదపాక రాజేందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల హెచ్చరిక

- బొగత వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు


పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండలంలోని చీకుపల్లి బొగత జలపాతం వద్ద ప్రమాదాలకు ఎవరూ ఇబ్బందులు పడొద్దని పోలీసుల హెచ్చరిక పేరుతో శుక్రవారం పోలీసులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేశారు. జలపాతంలో మొసళ్లు ఉన్నాయని, హద్దు మీరకండి..అయిన వాళ్లకు దురం కాకండి.. అని ఫ్లెక్సీల్లో రాశారు.

క్రీడల్లో పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి

- కేవీ ప్రిన్సిపాల్ సుభాషిణి
- ముగిసిన రీజినల్ స్పోర్ట్స్ మీట్


విజేతలను అభినందిస్తున్న కేవీ ప్రిన్సిపాల్ సుభాషిణి

కాజీపేట అర్బన్ : క్రీడల్లో పోటీతత్వాన్ని పెంపొందించుకుని ఉన్నత లక్ష్యాన్ని సాధించాలని కేవీ ప్రిన్సిపాల్ సుభాషిణి అన్నారు. కాజీపేట మండలం కడిపికొండలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయలో నిర్వహిస్తున్న తెలంగాణ, ఏపీ రీజినల్ స్పోర్ట్స్ మీట్ శుక్రవారం ముగిసింది. రీజినల్ స్పోర్ట్స్ మీట్‌లో టేబుల్ టెన్నిస్ విభాగంలో అండర్–14 విభాగంలో బాయ్స్ అండ్ గర్ల్స్ కేవీ వాల్తేరు ప్రథమ స్థానంలో నిలిచారు, అండర్–17 విభాగంలో కేవీ వాల్తేరు బాలికలు, కేవీ తిరుపతి బాలురు ప్రథమ స్థానంలో, అండర్–19 విభాగంలో కేవీ విశాఖపట్నం బాలికలు, ఒంగోలు బాలురు ప్రథమ స్థానంలో విజేతలుగా నిలిచారు. పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ వరంగల్ విద్యార్థులు కె.ఆనంతశ్రీ, పి.శ్రీజ, సిహెచ్.సూర్య, కె.కోదండరామ్ జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. విజేతలను, జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ సుభాషిణి అభినందించారు. కార్యక్రమంలో కేవీ పీఈడీ క్కొర శ్రీనివాస్, హైదరాబాద్ రీజియన్ పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.